కథ

# చుక్కాని లేని నావ

కె. వరలక్ష్మి



సుభద్ర పెద్దగా చదువుకోలేదు. ఆమెకి మతిపోయినట్టుగా ఉంది. ఓ పక్క పక్షవాతంతో మంచానపడ్డ సూరపరాజు గారికి కుడి పార్శ్వం చచ్చుబడి పోవడంతో మాట కూడా పడిపోయింది. ఆయన గవర్నమెంటు హైస్కూల్లో హెడ్మాస్టరుగా పని చేసాడన్న మాటేగాని భార్యకేనాడూ ఆర్థిక విషయాలేవీ చెప్పేవాడు కాడు. కాయగూరల్తో సహా పదహారూ ఆయన తెచ్చిపడేస్తే వండి పెట్టడమే పరమావధిగా ఆవిడ జీవితం ఇంతవరకూ గడిచింది. ఇప్పుడు ఒక్కసారిగా ఆర్థిక వ్యవహారాలు నెత్తినపడే సరికి ఉక్కిరిబిక్కిరిగా ఉంది. ఎవరెవరో ప్రాంసరీ నోట్లు పట్టుకొచ్చి సూరపరాజుగారు బాకీ ఉన్నాడని చెప్తుంటే ఆమెకంతా అయోమయంగా ఉంది. ఆ నోట్లు చూపించి అవునా అని అడిగితే అవునంటూ తల ఊగిస్తున్నా డాయన. సూరపరాజు గారు చాలా మంచి వ్యక్తి, ఎవరే ఇబ్బందిలో ఉన్నా నేనున్నానంటూ నిలబడతారని అందరూ అంటూంటే మురిసిపోయేది తను. ఇందులో కొన్ని నోట్లు ఆ మంచితనం తాలూకు హామీ ఉన్నవని తెలిసి ఏడుపొస్తోందావిడకి.

ఉన్న ఒక్క కూతుర్నీ అక్కర్లేని పరుగులుపెట్టి తలకు మించిన అప్పులు చేసి అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వాడికిచ్చి పెళ్లి చేసి అంతదూరానికి పంపించారు. ఇప్పుడు తండ్రి మంచం పట్టాడని తెలిసినా రాలేని ఇబ్బందుల్లో ఉన్నానని ఫోన్ చేసినప్పుడల్లా ఏడుస్తుంది వెర్రిపిల్ల.

దూరపుకొండలు నునుపు. అక్కడ మనకి తెలీని ఇబ్బందులు వాళ్లకేం ఉన్నాయో ఎవరికెరుక!

అదేం ఖర్మమో, రిటైరైన రోజు స్కూల్లో జరిగిన సన్మానసభలో మాట్లాడుతూ అంతులేని యాంగ్జైటీతో విరుచుకుపడిపోయాడాయన. స్కూలు వాళ్లు టాక్సీలో తీసుకొచ్చి ఇంట్లో దింపి వెళ్లేరు.

కబురందు వచ్చిన చుట్టాలూ పక్కాలూ ఒకళ్లని మించి ఒకళ్లు ఖరీదైన హాస్పిటళ్ల పేర్లు చెప్పేరు ఆయన వైద్యానికి.

తీరా చూస్తే బేంకు ఎకౌంటులో గాని, ఇంట్లోగాని ఆయన గారు దాచిన డబ్బులేమీ లేవు. ఇంట్లో ఉన్న నగా నట్రా తాకట్టు పెట్టి, బంధువుల దగ్గర అప్పులు తెచ్చి ఆయనకి వైద్యం చేయించింది. వచ్చింది గట్టి స్ట్రోకు కావడం వలన ప్రాణం నిలబడిందే తప్ప మనిషి లేచి తిరిగే పరిస్థితి పోయింది.

నెలనెలా జీతంలాగే పెన్షనూ వచ్చేస్తుంది కాబోలనుకున్న సుభద్రకి హాస్పిటల్స్‌కి తిరగడం హడావుడి ముగిసి ఇంటికి వచ్చాక కనుక్కుంటే తెలిసింది ఏమిటంటే దానికి చాలా తతంగం ఉంటుందని.

ఎన్నడూ ఆయన పనిచేసిన స్కూలు ముఖం ఎరగని సుభద్ర పెన్షను విషయం కనుక్కోడానికి స్కూలుకెళ్లింది. కొంగు నిండుగా కప్పుకొని బిడియపడుతూ గేటు లోపలికి అడుగు పెట్టిన ఆమెని మొదట ఎవరూ గుర్తు పట్టలేదు.

ఎవర్ని పలకరించాలో, ఎవర్ని అడగాలో తెలీక గేటు పక్క ఓ మూల ఒదిగి నిల్చుంది.

చాలాసేపటికి అటుగా వచ్చిన రికార్డు అసిస్టెంటు రమణ ఆమెని చూసి గుర్తుపట్టి దగ్గరకి వచ్చాడు 'నమస్కారం' అంటూ చేతులు జోడించి, అతను అర్జెంటు సంతకాలేవైనా కావాల్సి వచ్చినప్పుడు సూరపరాజు గారి కోసం ఇంటికి వచ్చేవాడు.

సుభద్ర మెల్లగా లోస్వరంతో విషయం చెప్పింది. రమణ ఆవిడని కొత్త హెడ్‌మాస్టరు దగ్గరకి తీసుకెళ్లేడు. విషయం అంతా వివరించి చెప్పేడు.

అంతా విన్నాక ''అదేంటి, ఇప్పుడందరూ రిటైర్ కావడానికి రెండు మూడు నెలల ముందే ఫైల్ తయారు చేసి పెట్టుకుంటున్నారుగా'' అన్నాడాయన.

''సూరపరాజు గారు అందరి పన్లూ చేసి పెట్టడమే గాని సొంతపన్లు చేసుకునే మనిషి కారులెండి'' అన్నాడు రమణ.

''ఇప్పుడెలాగ.మరి, చాలా తతంగం ఉందే. డి.ఇ.ఓ. ఆఫీసు నుంచి సర్వీసు రిజిస్టరు తెప్పించి పెన్షను, గ్రాట్యుయిటీ ఎకౌంటు ఫైలు తయారుచేయించాలి. మామూలు స్కూల్ అసిస్టెంట్స్ ఐమీన్ టీచర్స్‌కైతే హెడ్మాస్టరు సంతకాలు సరిపోతాయి. హెడ్మాస్టర్స్‌కి అలాక్కాదు కదా! ఫైలు డి.ఇ.ఓ. ఆఫీసులో సబ్మిట్ కాబడి అక్కడినుంచి డి.ఇ.ఓ. సంతకాల్తో హైదరాబాదు ఎ.జి. ఆఫీసు కెళ్లాలి. అక్కడ ఎకౌంట్స్ తయారై ఎమౌంటు శాంక్షనవ్వాలి. చాలా పెద్ద ప్రాసెస్ ఉందే'' అని చూపుడు వేలుతో బుర్ర గోక్కున్నాడాయన.

''మనమే ఏదో ఒకటి చెయ్యాలండి. ఆయనగారేమో మంచం లోంచి లేవలేని స్థితిలో ఉన్నారండి. అమ్మగారేమో ఎప్పుడూ బైటికొచ్చిన మనిషి కారు'' అన్నాడు రమణ.

''సూరపరాజు గారు రిటైరై ఆర్నెల్లు కావస్తుంటే మీరంతా ఏం జేస్తున్నారయ్యా?... సరే, మన యు.డి.సి.ని పిల్చుకురా'' అన్నాడు.

''మీరలా కూర్చోండమ్మా'' అన్నాడు హెడ్మాస్టరు ఇటు తిరిగి.

సుభద్ర అక్కడున్న ఓ బెంచీ చివర ఒదిగి కూర్చుంది. యు.డి.సి. వచ్చేడు. అంతా విని ''ఈ ఫైలు తయారు చేసేవోళ్లు ప్రస్తుతం మనకిక్కడెవరూ లేరండి. పెద్దనాపల్లిలో రిటైర్డు లెక్కల మేస్టరొకాయన చేసి పెడతాడండి. కాని, డబ్బులుచ్చుకుంటాడు మరి'' అన్నాడు.


''పుచ్చుకుంటే పుచ్చుకోనీ. పని కదా ముఖ్యం, ఏమమ్మా'' అన్నాడు హెడ్మాస్టరు సుభద్రతో.

అవునన్నట్టు తల ఊగించింది సుభద్ర.

''ఈ రోజు నుంచి తీరికైనప్పుడల్లా నువ్వాపని మీదుండవయ్యా. మన స్కూల్లో పనిచేసి రిటైరైన హెడ్మాస్టరుకి ఆర్నెల్లైనా పెన్షను సేంక్షన్ కాలేదంటే మనకే చెడ్డపేరు. నీకు స్కూటరుంది కదా! పెద్దనాపల్లి ఇక్కణ్నుంచి పది పన్నెండు కిలో మీటర్లుంటుంది అవునా? వెళ్లి చేయించుకొచ్చెయ్యి. ఖర్చులు ఆవిడిచ్చేస్తారు'' అన్నాడు

అలాగే ఇచ్చేస్తానంటూ సుభద్ర గబగబా తల ఊగించింది.

అప్పుడలా ప్రారంభమైన సూరపరాజు గారి పెన్షను ఫైలు ఓ నెల రోజులకి తయారై డి.ఇ.ఓ ఆఫీసుకెళ్లింది.



'ప్రస్తుతం ఆ పనులన్నీ డిప్యూటీ డి.ఇ.ఓ.కి అప్పగించడం వల్ల ఈ ఫైలు పని మాది కాదు' అని ఓ నోట్ రాసి పక్కన పడేసారు వాళ్లు. ఆ ఫైలు ఓ నెల రోజులు అక్కడే పడి ఉంది. స్కూలుకి ఆ విషయమై లెటరు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు.

రమణ వచ్చి ఆ కబురు కాస్తా చెప్పి వెళ్లేడు.

సుభద్ర మళ్లీ స్కూలుకి పరుగెత్తింది. యు.డి.సి రేపే వెళ్లి ఆ పని చూస్తానని ప్రామిస్ చేసాడు. ఇప్పటివరకూ ఫైలు తయారు చేయించడం, పదే పదే స్కూటరు మీద తిరగడం వల్ల పెట్రోలుకైన ఖర్చు అంటూ అయిదు వేలు బిల్లు చేతిలో పెట్టేడు.

అన్ని అప్పుల్లో ఇదో అప్పు అనుకుని డబ్బులు రాగానే ఇచ్చేస్తానని చెప్పి వచ్చింది సుభద్ర.

ఫైలు డి.ఇ.వో ఆఫీసు నుంచి కదిలి పక్కనే ఉన్న డిప్యూటీ డి.ఇ.వో. ఆఫీసుకు చేరడానికి ఓ నెల, అక్కణ్నుంచి ఎ.జి. ఆఫీసుకు చేరడానికి మరో నెల, ఎ.జి ఆఫీసులో పని ముగిసి చెక్కు ట్రెజరీకి రావడానికి మరో రెండు నెలలు పట్టేయి. వచ్చి చెక్కు తీసుకోండని ఇంటికి లెటరొచ్చింది.

ఇంగ్లీషులో ఉన్న ఆ కాయితాల్ని పట్టుకుని మళ్లీ స్కూలుకి పరుగెట్టింది సుభద్ర.

జిల్లా కేంద్రంలో ట్రెజరీ ఎక్కడుందో చెప్పి, ఆ లెటరు కొంచెం డబ్బులు పట్టుకుని వెళ్లమని సలహా ఇచ్చాడు హెచ్చెమ్ గారు.

కొంచెమంటే ఎంతో చెప్పలేదాయన.

మర్నాడు పొద్దుటే సూరపరాజుగారికి స్నానం వగైరా చేయించి, కాస్త అన్నం వండి తినిపించేసి, తను కాస్త ఎంగిలిపడి, ఇంటికి తాళం వేసుకుని యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి బయలుదేరింది సుభద్ర. బస్సు దిగి, ట్రెజరీ ఎక్కడో కనుక్కుని గేట్లోంచి లోపలికి వెళ్తొంటే కాళ్లు వణికి, ఒళ్లంతా చెమటలు పోసాయి. అన్ని టేబుల్స్‌నీ, అంతమంది ఉద్యోగుల్ని చూసేసరికి గుండె దడపట్టుకుంది. మాట్లాడకుండా లెటర్ తీసి అక్కడ కన్పించిన వాళ్లెవరికో ఇచ్చింది.

ఏ టేబుల్ దగ్గర కెళ్లాలో చూపించేరు వాళ్లు.

''మీరొచ్చేరేంటి, సూరపరాజు గారు రావాలి'' అన్నాడా టేబుల్ దగ్గరి వ్యక్తి.

ఆయన అనారోగ్యం గురించి చెప్పింది సుభద్ర.

''అర్రర్రే...'' అని నొచ్చుకుని ''తాతారావ్'' అని అటెండర్ని పిలిచాడాయన. సదరు తాతారావు వచ్చేక ''వీరికి విషయం చెప్పు'' అన్నాడు.

తాతారావు సుభద్రని బైట వరండాలోకి తీసుకెళ్లి ''నాలుగు వందల డెబ్బై ఇవ్వండమ్మా'' అన్నాడు.

సుభద్ర రెండు వందలు మాత్రమే తెచ్చింది. విషయం విని ''అయితే రేపు రండి'' అని వెళ్లి పోయాడతను.

ఈసురోమని వెనక్కొచ్చింది సుభద్ర. మర్నాడు ఆదివారం, సోమవారం నాడు అయిదొందలు పట్టుకుని మళ్లీ వెళ్లింది. డబ్బులు పుచ్చుకుని ''మీ పని అయినట్టే, ఇంక ఎళ్లండమ్మా'' అన్నాడు తాతారావు ''మరి... డబ్బో...'' అని నసిగింది సుభద్ర.

''డబ్బులిక్కడివ్వరండి, మీ వూళ్లో సబ్ ట్రెజరీ నేదా, అక్కడిత్తారు'' అన్నాడు, ''రేపో ఎల్లుండో ఈ కాయితాల ట్టుకుని అక్కడికెళిపోండి'' అని కవరొకటి చేతిలో పెట్టేడు.

రెండు రోజులాగి సుభద్ర ఊళ్లో ఉన్న సబ్ ట్రెజరీకెళ్లింది. ఇక్కడి ట్రెజరీ చిన్నది. ఒకే గదిలో మూడు టేబుళ్లున్నాయి. సుభద్ర కవరు పట్టుకెళ్లి ఒకాయన చేతిలో పెట్టింది. ఆయన కాయితాల్ని తిరగేసి మరగేసి చూసి బైటున్న పెంటారావుని పిలిచేడు. పెంటారావు సుభద్రని బైటికి తీసుకెళ్లి "అమ్మా, లోపల మూడు కుర్చీలు చూసేరు కదా, అందులో ఒకాయనకి ఎయ్యి, ఇద్దరికి రెండ్రెదులు, నాకు రెండు మొత్తం ఇరవై రెండు కర్సవుతాంది. ఆ డబ్బులుచ్చుకుని అయ్యగార్ని తీసుకుని రేపొచ్చెయ్యండి. ఎంటనే మీ పనై పోతాది'' అన్నాడు.

గబగబా లెక్కలేసుకున్న సుభద్ర "రెండు వేల రెండొందలే? అంత డబ్బు ప్రస్తుతం నా దగ్గిర లేదు తమ్ముడూ. పోనీ డబ్బు లొచ్చేక ఇచ్చేస్తాలే'' అంది.

పెంటారావు సుభద్రని 'ఎంత అజ్ఞానివమ్మా' అన్నట్టు జాలిగా చూసేడు. "మీ ఇష్టం, డబ్బు లట్టు కొత్తే ఎంటనే పనైపోతాది. లేపోతే అదిగో ఆళ్లలాగ నెల్లో రెణ్ణెల్లో తిరగాల మరి'' అని కారిడార్లో కూర్చున్న వాళ్లనీ, నిల్చున్న వాళ్లనీ చూపించేడు. ఓ ముప్పై నలభై మంది ఉన్నారక్కడ.

"ఎంతవడ్డీ లాసో ఆలోసించుకోండి మరి'' అంటూ ఇక చెప్పేదేం లేదన్నట్టు వెళ్లిపోయేడు పెంటరావు.

అంతపెద్ద ట్రెజరీలో నాలుగొందల డబ్బుయ్యేంటో, ఇంత చిన్న ట్రెజరీలో రెండు వేల రెండొందలేంటో, అసలీ లెక్కలేంటో తెలీక ఇంటికొచ్చి తలపట్టుకూర్చుంది సుభద్ర. జీవిత కాలమంతా చచ్చీ చెడీ చేసిన సర్వీసుకి వచ్చిన ప్రతి ఫలాన్ని పొందడానికి వీళ్లందరికీ ఈ ముడుపు లెందుకు చెల్లించాలో అనుకుంది. మరో పక్క తీర్చాల్సిన అప్పులకి పెరిగిపోతున్న వడ్డీని తల్చుకుంటే భయం వేసింది. ఈ ఒక్క గండం గట్టెక్కించు దేవుడా అని కనపడని దేవుళ్లందరికీ మొక్కింది.

సుభద్ర పడుతున్న పాట్లు చూస్తూ మౌనంగా కన్నీరు కార్చడం తప్ప ఏమీ చెయ్యలేక పోతున్నందుకు కుమిలిపోతున్నాడు సూరపరాజుగారు. ఆయనకిప్పుడు తెలిసి వస్తోంది – భార్యల్ని కూడా వ్యక్తులుగా చూసి వాళ్లకి కష్టసుఖాలన్నీ చెప్పుకోవాలనీ, ఆర్థిక లావాదేవీలు వాళ్లకి తెలియజెయ్యాలనీ, పది నెలలుగా జీతం నాతం లేకపోయినా, నోటి మంచితనంతో ఇంటిని నడుపుకొస్తున్న సుభద్ర అమాయకురాలనీ, ఆమెకేం తెలీదని అనుకుని తనెంత పొరపాటు చేసాడో ఇప్పుడు అర్థమౌతోంది.

ఆ రోజు అనపర్తి నుంచి పెద్దిరెడ్డి గారొచ్చాడు. సూరపరాజు గారి క్షేమ సమాచారాలు విచారించాక అసలు విషయం బైట పెట్టేడు. కూతురి పెళ్లికి సూరపరాజుగారు ఆయన దగ్గరచేసిన బాకీ రెండు లక్షలూ ఈ పది నెలల వడ్డీతో తడిసి మోపెడైందట. అంతకు ముందంతా ఏనెల కానెల జీతం లోంచి వడ్డీ కట్టెయ్యడం వలన చాలా సేఫైపోయేనట.

జేబులోంచి ప్రాంసరీనోటు తీసి చల్లగా బైటపెట్టేడాయన. రేపో ఎల్లుండో డబ్బులు రాబోతున్నాయని తెలిసిందట. ఇబ్బందుల్లో ఉన్నారని ఇన్నాళ్లూ అడగలేదట.

ఉన్న అప్పులకి తోడు ఇంత పెద్ద కొత్త అప్పు పుట్టుకొచ్చే సరికి బిత్తర పోయింది సుభద్ర.

వెంటనే తేరుకుని నిండా మునిగిన వాడికి చలేమిటి అని సర్ది చెప్పుకొంది. ట్రెజరీ వాళ్లకి ఇవ్వాల్సిన రెండు వేల రెండొందలు ఆయన్నే అప్పడిగింది.

ఒక్క రోజుకే కాబట్టి వడ్డీ తీసుకోనని ప్రకటించి చాలా ఉదారంగా రెండు వేల అయిదొందలు తీసిచ్చేడాయన. ప్రశ్నార్థకంగా చూసిన సుభద్రతో "ఫర్లేదు ఉంచండి, మూడొందలు ఖర్చుల కుంటాయి'' అన్నాడు.

అంత ఉదారత చూపిన ఆ పెద్ద మనిషి మర్నాడు డబ్బులొచ్చేక చాలా కఠినంగా వ్యవహరించేడు. 'అంత కాలం వడ్డీ పుచ్చుకున్నారు కదా ఈ పదినెల్ల వడ్డీ కొట్టెయ్యండి' అంటే "పది నెల్ల వడ్డీ కాదు కదా, ఒక్క రూపాయి కూడా తగ్గించను. లేదంటే చెప్పండి ఆయన సంతకాలు పెట్టిన ఈ ఖాళీ నోట్ల మీద కొత్త తారీఖువేసి అయిదు లక్షలు బాకీ రాసేసి కోర్టుకెళ్లిపోతాను'' అన్నాడు.

కళ్లనీళ్ల పర్యంతమౌతూ సుభద్ర ఆయన ముడుపు ముందు చెల్లించేసింది. ఇంకా ఇతర బాకీల వాళ్లకి, పది నెలలుగా అద్దె అడగని ఇంటి గల వాళ్లకి, పచారీ కొట్టు, పాల బాకీ, చేబదుళ్లిచ్చిన చుట్ట పక్కాలకీ అందరికీ పంచేసింది.

అంతడబ్బు చేతికొచ్చినట్టే వచ్చి అలా రెక్కలొచ్చి ఎగిరిపోవడం చూసి ధనలక్ష్మి చంచల అంటారిందుకే కాబోలు అని తనకి తను వేదాంతం చెప్పుకొని, సూరపరాజు గారికీ చెప్పింది.

వచ్చే ఫస్టు నుంచి నెలనెలా పెన్షను వస్తుంది. రెండు

ఆయనకిప్పుడు తెలిసి వస్తోంది – భార్యల్ని కూడా వ్యక్తులుగా చూసి వాళ్లకి కష్టసుఖాలన్నీ చెప్పుకోవాలనీ, ఆర్థిక లావాదేవీలు వాళ్లకి తెలియజెయ్యాలనీ, పది నెలలుగా జీతం నాతం లేకపోయినా, నోటి మంచితనంతో ఇంటిని నడుపుకొస్తున్న సుభద్ర అమాయకురాలనీ, ఆమెకేం తెలీదని అనుకుని తనెంత పొరపాటు చేసాడో ఇప్పుడు అర్థమౌతోంది.

ప్రాణాలకి అది చాల్లే అని సర్ది చెప్పుకొంది.

అంతలో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల గ్రూప్ ఇన్సూరెన్స్ ఆఫీసు నుంచి లెటరొచ్చింది – ముప్పై వేలు సూరపరాజు గారికీ వచ్చేవి ఉన్నాయి వచ్చి పట్టుకెళ్లండని.

మరో పక్క స్కూలు నుంచి కబురొచ్చింది. జి.పి.ఎఫ్ డబ్బులు వచ్చేయి రమ్మని.

సుభద్ర ముందు స్కూలు కెళ్లింది. హెచ్చెమ్ ఏవేవో లెక్కలు చెప్పి, కూడికలూ తీసివేతలూ చేసి ఇరవై వేలు చేతిలో పెట్టేడు. "సూరపరాజు గారు ఎప్పటికప్పుడు లోన్ పెట్టి డబ్బులు తీసేసు కున్నాడమ్మా, లేకపోతే జి.పి. ఎఫ్ లక్ష పైనే వచ్చేది'' అన్నాడు.

చెప్పుకొన్న వేదాంతమంతా గాలికెగిరిపోయి ప్రాణం ఉసూరుమంది సుభద్రకి.

కారిడార్లో నడిచొస్తుంటే టీచర్స్ రూం ముందు నిలబడి మాట్లాడుకుంటున్న వాళ్లు "పాపం ఆయన మంచంలో ఉన్నాడు. ఈవిడకేం తెలీదు. అక్కణ్నుంచెంతొచ్చిందో, ఈయనగారెంత నొక్కేసేడో'' అనుకోవడం విన్పించింది.

ఇంతవరకూ ఆయన అనుభవాన్ని బట్టి జిల్లా కేంద్రంలో ఉన్న ఇన్సూరెన్స్ ఆఫీసుకి ఓ వెయ్యి రూపాయలు పట్టుకొని వెళ్లింది. అక్కడి గుమస్తా వచ్చి పని చూడకుండా ఒకటే నసుగుతుంటే టైం వేస్తెందుకుని "ఎంతివ్వాలో చెప్పండి'' అనడిగింది.

"అదేంటమ్మా ఆఫీసులో పబ్లిగ్గా అలా అడిగేస్తున్నారు'' అన్నాడతను ఉలిక్కిపడి. కాని, అంతవరకూ ముడుచుకుని ఉన్న అతని మొహం కళకళలాడింది.

"నాలుగొందలు'' అన్నాడు పక్క వాళ్లకి వినబడకుండా, సుభద్ర నాలుగొందలు తీసి టేబుల్ మీద పెట్టింది. అతను చప్పున తీసి టేబుల్ సొరుగులో వేసుకుని "చెక్కు పోస్టులో ఇంటికి పంపిస్తాం మీరెళ్లిపోండి'' అన్నాడు.

నాలుగు రోజులు పోయాక మరో లెటరొచ్చింది. డిప్యూటీ డి.ఇ.వో ఆఫీసు నుంచి 'సూరపరాజు గారి ఫేమిలీ బెనిఫిట్ ఫండ్స్ తాలూకు ఎమౌంటు ఓ ఇరవై వేల వరకు రావచ్చు. ఆయన వర్క్ చేసిన అన్ని చోట్ల నుంచీ సర్వీసు సర్టిఫికెట్స్ తీసుకుని పంపించండి' అంటూ.

ఆయన ఉద్యోగ రీత్యా తాము ఓ పది ఊళ్లు తిరిగేరు. ఎక్కడో దూరంగా మారుమూల.అడవుల్లో కూడా చేసి వచ్చేరు.

కదల్లేని ఈ మనిషిని వదిలేసి ఈ ఊళ్లన్నీ ఎలా తిరిగి రావాలా అని ఉసూరు మంది సుభద్ర.

ఓ రోజు తీరిగ్గా కూచుని అన్ని స్కూల్స్‌కీ ఉత్తరాలు రాసింది సంగతి వివరిస్తూ. స్టేంపులు అంటించిన ఖాళీ కవర్లు పంపించింది. నెల గడిచింది, రెండు నెలలు గడిచాయి. ఎక్కడి నుంచీ రిప్లై అనేది రానే లేదు.

చూసి చూసి విసిగిపోయి రోజుకో ఊరెళ్లి రావాలని నిశ్చయించుకుని తనే బయలుదేరింది సుభద్ర.

ఆ ప్రయాణాల్లో ఓసారి భద్రిరాజు గారు కన్పించేడు బస్సులో. ఆయన సుభద్రకి వరుసకి మేనమామ. క్షేమ సమాచారాలయ్యేక "అమ్మడూ! అప్పట్లో సూరపరాజు కన్నా ముందు నీకో సంబంధం వచ్చింది గుర్తుందా, వత్సవాయొళ్ల కుర్రోడు. వందెకరాల మాగాణీ అదీ... గుర్తొచ్చిందా? ఆడిప్పుడొక ఎకరమైనా మిగిలితే ఒట్టు... ఓ... ఎక్కళ్లేని జమిందారీ ఖర్చులు పెట్టేత్తే ఏటవుద్ది మరి! అప్పట్లో మీ బాజీ నిన్ను సూరపరాజు కివ్వాలా, ఆడికివ్వాలా అని సేలా ఆలోచించేరు. ఆడు కట్నం ఎక్కువడిగేడని సూరపరాజునే కాయం చేసేరు. ఏం జరిగినా మన మేలుకేనని పెద్దలు ఉత్తినే అన్లేదు మరి'' అన్నాడు.

సుభద్ర వెళ్లిన చోట పని అవుతుందో లేదోనని ధ్యాసలో ఉండి ఏమీ మాట్లాడలేదు.

"సూరపరాజు రిటైరయ్యేడంటగా, బోలెడబ్బులొచ్చుంటాయిలే. మాలాటోళ్లం అంపడతావేంటి మీకు ఇంక మీద? గవర్నమెంటు ఉజ్జోగాలోళ్లకి అప్పనంగా వచ్చి పడతన్నాయి డబ్బులు'' అంటూ రుసరుసలాడుతూ బస్సు దిగిపోయేడాయన.

సుభద్రకి ఆమాటకి నవ్వాలో ఏడవాలో తెలీలేదు –

మొత్తం మీద డెబ్బై వేలూ చేతికందాయి.

వాటిని బేంకులో ఫిక్సడులో వేద్దామనుకునే వేళకి సూరపరాజుగారి ఆఖరి తమ్ముడొచ్చేడు. ఉన్న ఊళ్లో మెట్ట పొలం సాగుచేసుకుంటూ కిందా మీదవుతున్నాడాయన. కూతురుకి పెళ్లి కుదిరిందట. ఆ పిల్ల పెళ్లికి కట్నం తనిస్తానని ఎప్పుడో మాటిచ్చాడట సూరపరాజుగారు.

అవునా? అన్నట్లు ఆయన వేపు చూసింది సుభద్ర. అవునని తల ఊగించాడాయన.

యాభై వేలు మరిది చేతిలో పెట్టి, ఉన్న ఇరవై వేలు బీరువాలో పెడుతూ "దేవుడా! ఇకపైన తగని తప్పని ఖర్చులేవీ రాకుండా చూడు తండ్రీ'' అని మొక్కుకుంది సుభద్ర.

అతిథి సత్కారాలు పొంది తిరిగి వెళ్తూ "వొదినమ్మా! అన్నయ్యని అలాగ ఇంట్లో పెట్టుకు కూచోకపోతే కాస్త మంచి డాక్టరుకి చూపించొచ్చు కదా!'' అని ఓ ఉచిత సలహా పడేసాడు మరిది.

*

చిరునామా.
కె.వరలక్ష్మి
శ్రీ రవీంద్ర నిలయం, శ్రీరామ్‌నగర్,
జగ్గంపేట - 533 435, ఈస్ట్ గోదావరి జిల్లా
సెల్: 98664 67062.